


కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

దాంపురంలో బోరు పునరుద్ధరణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అధికారుల్లో కదలిక వచ్చింది. తక్షణమే బోరును పునరుద్ధరించి గ్రామస్తుల దాహార్తిని తీర్చారు. రెవెన్యూ సదస్సులతో కేవలం భూ సమస్యలే కాకుండా గ్రామాల్లోని ఇతర సమస్యలు కూడా పరిష్కారం అవుతున్నాయి. ఈ నెల 27న శృంగవరపుకోట మండలంలో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ పర్యటించారు. దాంపురం గ్రామంలో ఆరోజు ఉదయం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని మంచినీటి సమస్యను గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నెల రోజులుగా బోరు పనిచేయపోవడంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ, తక్షణమే బోరును పునరుద్ధరించాలని డిపిఒను ఆదేశించారు. దీంతో డిపిఒ టి.వెంకటేశ్వర్రావు అదేరోజు మధ్యాహ్నం సిబ్బందితో గ్రామానికి చేరుకొని బోరును పునరుద్ధరించారు. జిల్లా కలెక్టర్ ఉదయం ఆదేశించడం, సాయంత్రానికే బోరు బాగవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

తలకిందులైన పాలనాధికారం

ఓడలు బండ్లు.. బండ్లు ఓడలవుతాయనడానికి ఈ ఏడాది చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలే ప్రత్యక్ష తార్కాణం. 2024వ సంవత్సరం రాజకీయంగా పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా 1994 నాటి రాజకీయ చరిత్రను టిడిపి మరోసారి తిరగరాసింది. గడిచిన ఐదేళ్లపాటు ప్రజా పోరాటాలపై మోపిన తీవ్ర నిర్బంధాలు, కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను, వనరులను కట్టబెట్టడంతోపాటు జనాన్ని మతతత్వంతో రెచ్చగొట్టడం ద్వారా ఏకంగా రాజ్యాంగ స్ఫూర్తినే దెబ్బతీసేందుకు ప్రయత్నించిన బిజెపితో జతకట్టిన వైసిపికి తగిన గుణపాఠం నేర్పారు. దీంతో జిల్లాలో వైసిపి ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. మన్యం జిల్లాలో సిపిఎంకు ఆదరణ పెరిగింది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ఎన్నికల ఫలితాల రోజు విజయానందంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, టిడిపి నాయకులు(ఫైల్)

- చరిత్రను తిరగరాసిన 2024
- మూల్యం చెల్లించుకున్న వైసిపి
- అదే బాటలో టిడిపి
- బోణీ కొట్టిన జనసేన
- ప్రజా సమస్యలే అజెండాగా వామపక్షాలు

2024 రాజకీయ ముఖచిత్రాన్ని ఒక్కసారి పరిశీలిస్తే మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికలు అత్యంత కీలకమైనవి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో పది నియోజకవర్గాలు, శ్రీకాకుళం జిల్లా నుంచి కలిసిన మరో రెండు అసెంబ్లీ స్థానాల్లో వైసిపి అడ్రస్ లేకుండా పోయింది. ఆయా 12 స్థానాల్లోని 10 స్థానాల్లో టిడిపి, రెండు స్థానాల్లో జనసేన విజయకేతనం ఎగురవేశాయి. విజయనగరం ఎమ్‌పి స్థానం కూడా టిడిపి ఖాతాలోకి వెళ్లింది. మన్యం జిల్లా పరిధిలో ఉన్న అరకు పార్లమెంట్‌ను మాత్రం వైసిపి పదిలం చేసుకుంది. టిడిపిలో ఎమ్‌పి, ఎమ్మెల్యేలు నూతనంగా ఎన్నికైనవారే ఎక్కువగా ఉన్నారు. సామాజిక తరగతి, రాజకీయాల్లో సీనియర్, మహిళ కావడం వంటివి గుమ్మిడి సంధ్యారాణికి రాష్ట్ర మంత్రివర్గంలో చేరేందుకు కలిసొచ్చాయి. కొండపల్లి శ్రీనివాస్ రాజకీయాల్లో కొత్త అయినప్పటికీ, సామాజిక తరగతి, యువకుడు కావడం వంటి అంశాలు తోడ్పాటును అందించాయి. దీంతో పార్టీలో సీనియర్లు, సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాల నుంచి వచ్చినవారు ఒకింత కంగుతిన్నారు. వీరిలో ఒకరి పనితీరుపై జిల్లాలో విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరు నెలలు కావస్తున్నా జిల్లాపై పట్టు సాధించలేదని, అటు రాజకీయంగానూ వెనుకబాటు ఉందనే అపవాదును మూటగట్టుకుంటున్నారు.



ఇక జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్‌పిల పనితీరు పరిశీలిస్తే కొత్తదనం ఏమీ లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విజయనగరం ఎమ్‌పి ప్రజా సమస్యలపై ఉన్నతాధికారులకు, పై స్థాయిలో ఉన్న మంత్రులకు వినతులు, విజ్ఞాపనలు ఇవ్వడం తప్ప వాటి పరిష్కారానికి కృషి చేయడం లేదని కూడా చర్చ ప్రారంభమైంది. ఇక పాలన విషయానికి వస్తే గత ఎన్నికల్లో బాదుడే బాదుడు అంటూ నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్తు ఛార్జీలపై విమర్శలు చేసి, ఇప్పుడు అవే భారాలు మోపుతున్నారన్న చర్చ జనంలో ఊపందుకుంది. సూపర్ -6 పథకాలు కూడా ఇంకా పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి మొదలైంది. ప్రజలు పాలనలో కొత్తదనం ఆశించినప్పటికీ ఆ రకమైన ముద్ర పాలకులు వేసుకోలేకపోతున్నారు. ఇక వైసిపి విద్యుత్తు భారాలపైనా, రైతుల సమస్యలపైనా ఇప్పుడిప్పుడే పోరాటం మొదలు పెట్టింది. కానీ, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, ప్రత్యేక హోదా, విద్యుత్తు సంస్కరణలు వంటి ప్రభుత్వ విధాన పరమైన విమర్శల వరకు వెళ్లడం లేదు. దీంతో విధానపరమైన అంశాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు దొందూ దొందే అన్న చందంగా ఉన్నాయనే చర్చ నడుస్తోంది. టిడిపి, జనసేన కలిసి రాష్ట్రంలో అధికారంలో చేపట్టినప్పటికీ నాడు వైసిపి అవలంభించిన ప్రజావ్యతిరేక విధానాలే అమలవుతున్నాయి. వైసిపి స్థానంలో వచ్చిన టిడిపి కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి భజన చేస్తోంది. దీంతో అధికార మార్పిడి జరిగింది తప్ప, పాలనా పరమైన మార్పులేమీ జరగలేదని జనం చర్చించుకునే పరిస్థితి వచ్చింది. మాజీమంత్రి, వైసిపి సీనియర్ నేత బొత్స సత్యనారాయణ.. విశాఖ జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికవడం.. ఆ పార్టీ శ్రేణులకు కాస్త ఊరటగా చెప్పొచ్చు.

చరిత్రలో తొలిసారిగా నెల్లిమర్ల, పాలకొండ నియోజకవర్గాల్లో జనసేన బోణికొట్టింది. సిపిఎం, సిపిఐ తదితర వామపక్ష పార్టీలు ప్రజా సమస్యలే అజెండాగా ముందుకు సాగుతున్నాయి. మరోవైపు విజయనగరం జిల్లాలో సహా అరకు పార్లమెంట్ పరిధిలో సిపిఎంకు గతంతో పోలిస్తే బలం పెరిగింది. ఇటీవల కాలంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో మహాసభలు జరిగాయి. గత పోరాటాలు, ప్రభుత్వ వైఖరి, ప్రస్తుతం సవాలుగా మారిన ప్రజా సమస్యలు, జిల్లా సమగ్రాభివృద్ధి తదితర అంశాలపై చర్చించుకుని, భవిష్యత్తు పోరాటాలకు ప్రణాళికలు రూపొందించుకున్నాయి.

కానిస్టేబుల్ అభ్యర్థులకు

పరేడ్ గ్రౌండ్‌లో పిఎంటి, పిఇటి పరీక్షలకు ఏర్పాటు పూర్తి : ఎస్‌పి వకుల్ జిందాల్

నేటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు పిఎంటి, పిఇటి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. జిల్లాలో 9152 మంది అభ్యర్థులకు ఈ నెల 30 నుంచి జనవరి 22 వరకు పోలీసు పరేడ్ గ్రౌండులో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లుగా ఎస్‌పి చెప్పారు. ప్రతిరోజూ 600మంది అభ్యర్థులకు పిఎంటి, పిఇటి ప్రక్రియను పూర్తి చేసేటట్లుగా చర్యలు చేపట్టామని వెల్లడించారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సిసి కెమెరాల పర్యవేక్షణలోనే జరుగుతుందని, ఎటువంటి అవకతవకలకు తావు లేదని చెప్పారు. అభ్యర్థులు తమకు నిర్దేశించిన తేదీన ఉదయం 4 గంటలకు పరేడ్ గ్రౌండులో హాజరుకావాలని తెలిపారు. కానిస్టేబుల్ ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మవద్దని విజ్ఞప్తిచేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

మంచి కవిత్వం సమాజానికి అవసరం

ప్రజాశక్తి-విజయనగరం కోట

మంచి కవిత్వం సమాజానికి ఎంతో అవసరమని ప్రముఖ కవి, విశ్లేషకులు మానస చామర్తి అన్నారు. ఆదివారం నగరంలోని గురజాడ నివాసంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కవి పాయల మురళీ కృష్ణ రచించిన కవితా సంపుటి 'గచ్చెంసెట్టుకు అటూ ఇటూ'ని ద్వారం దుర్గాప్రసాదరావు ఆవిష్కరించారు. చీకటి దివాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా ప్రముఖ రచయితలు అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, గార రంగనాథం పాల్గొన్నారు. కథా సంపుటి పరిచయాన్ని కవి సుంకర గోపాలయ్య, ఆప్త వాక్యాలను కంచరాన భుజంగరావు, లండ సాంబమూర్తి అందించారు. కార్యక్రమంలో పూర్వ డిఇఒ అరుణ కుమారి, ప్రధానోపాధ్యాయులు సన్యాసిరాజు పాల్గొన్నారు.



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కవులు, సాహితీవేత్తలు

మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పిహెచ్ కార్మికులకు

కనీస వేతనాలు ఇవ్వాలి

- బకాయి జీతాలు చెల్లించాలి
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ
- 3న మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలకు పిలుపు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పిహెచ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఇంజినీరింగ్ విభాగం కార్మికుల సమావేశాన్ని కె.ఆదినారాయణ అధ్యక్షతన ఆదివారం ఎన్‌పిఆర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా ఇంజినీరింగ్ కార్మికుల జీవితాల్లో మార్పు లేదన్నారు. గత ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను కూడా ప్రస్తుత సర్కారు అమలు చేయడానికి సిద్ధంగా లేకపోవడం దారుణమన్నారు. 8 గంటలు పని చేసిన కార్మికుడికి కనీసం రూ.26 వేలు ఉంటే తప్ప బతకలేరని డాక్టర్ అక్రాయిడ్ ఫార్ములా చెబుతుంటే.., రూ.10 వేలు, రూ.12 వేలు, రూ.15 వేలు ఇచ్చి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ధరల్లో ఈ జీతాలతో ఎలా బతకాలని ప్రశ్నించారు. అవి కూడా సకాలంలో చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులందరినీ ఒక్కటి కానివ్వకుండా రకరకాల పేర్లతో విభజిస్తున్నారని, ఏ పేరు పెట్టినా ఎనిమిది గంటల పని చేసినా ప్రతి కార్మికుడికీ చట్ట ప్రకారం కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వ ఉద్యోగి మాదిరిగా హెచ్‌ఆర్, ఐఆర్, డిఎలు అమలు చేయాలన్నారు. అందుకు కార్మికులు చేస్తున్న పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని స్పష్టంచేశారు.

ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. అధికారంలోకి రాగానే జీతం పెంచుతామని యువగళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారని గుర్తుచేశారు. దీనిపై జనవరి మూడో తేదిన మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సుంకరి రామానాయుడు, ఎస్.నారాయణరావు, శ్రీను, అప్పారావు, భాస్కరరావు, గంగయ్య, పైడి రాము, కనకరాజు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం టౌన్ : చేతివృత్తుల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్లంబింగ్, కార్పెంటరీ, ఎలక్ట్రీషియన్, ఎసి, గీజర్, టీవీ, వాటర్ ప్యూరిఫైయర్, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ మరమ్మతులు చేసేవారు, సెలూన్, బ్యూటిషన్ కోర్సులు చేసేవారు మరింత నైపుణ్యం కోసం శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఇందుకుగాను జనవరి రెండో తేదీలోపు మెప్మా విభాగంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి పని కూడా కల్పిస్తారని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్, రెండు పాస్‌ఫోటోలు దరఖాస్తుతోపాటు జత చేయాలని కోరారు. వివరాలకు కార్పొరేషన్ కార్యాలయం పక్కనే ఉన్న మెప్మా విభాగంలో సంప్రదించవచ్చని తెలిపారు.

పన్నులు లేని ఇళ్లే లక్ష్యంగా

ఇంటింటికీ స్టిక్కర్లు

- రాష్ట్రంలోనే తొలిసారి అమలు
- రికార్డు స్థాయిలో 4 నెలల్లో రూ.15 కోట్లకు పైగా పెరిగిన ఆదాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంతకాలం నగర పాలక సంస్థ పాలకులు, అధికారులు నగర పాలక సంస్థ ఆదాయం పెరుగుదల విషయంలో నిర్లక్ష్యం చేశారా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గత ఏడాది వరకు పన్నుల ద్వారా 75శాతం ఆదాయాన్ని ఏనాడూ దాటలేదు. కోట్లాది రూపాయల పన్నులు బకాయిలు పేరుకుపోతుండేవి. పాలకులు సైతం బయటకు ఆదాయం పెంచాలని చెప్పడం తప్ప అధికారులకు సహకరించడం లేదన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు. అయితే దీనికి భిన్నంగా గతనాలుగు నెలల్లో ఆదాయం పెరుగుదలపై కమిషనర్ నల్లనయ్య ప్రత్యేక దృష్టి సారించడంతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి.



నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య బాధ్యతలు చేపట్టిన తర్వాత నాలుగు నెలల్లోనే నగరంలో ఆదాయం పెరుగుదల లక్ష్యంగా కొత్త పన్నులు విధించడం, మొండి బకాయిలపై దృష్టి పెట్టడంతో పాటు ఇంతవరకు షాపులు ద్వారా, నీటి కుళాయిలు ద్వారా రావాల్సిన పనులు రాబట్టడంతో బాగా మెరుగుదల కనిపిస్తోంది. అంతేకాకుండా నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న షాపులు, బడ్డీ లకు ట్రేడ్ లైసెన్స్ విధించి పన్నులు పెంచడంలో చేసిన కృషి సత్ఫలితాలనిస్తోంది. నల్లనయ్య కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన నాటికి 70250 ఎసెస్‌మెంట్లకు పన్ను రూ.13.15 కోట్లు వసూలు చేయగా నాలుగు నెలల కాలంలో కొత్త ఎసెస్‌మెంట్లు1524 గుర్తించి మొత్తం ఈ నెల 26 తేది నాటికి రూ.20.37 కోట్లు వసూలు చేయగా ఈ నాలుగు నెలలు కాలంలో రూ.7.11 లక్షలు ఆదాయం పెరుగుదల కనిపించింది. ఖాళీ స్థలాల పన్ను గత ఆగస్టు నెలాఖరు నాటికి 2748 అసెస్మెంట్లకు రూ.129.33 లక్షలు వసూలు కాగా సెప్టెంబర్ నుంచి ఈనెల 26వరకు 24 కొత్త ఎసెస్మెంట్లు గుర్తించగా మొత్తం విఎల్‌టి రూ.160.94 లక్షలకు పెరిగింది. ట్రేడ్ లైసెన్స్ ద్వారా ఆగస్టు నాటికి 1223 ఎసెస్మెంట్లకు రూ.98.32 లక్షలు వసూలు కాగా సెప్టెంబర్ నుంచి డిసెంబర్ 26 నాటికి అదనంగా 1420 ఎసెస్మెంట్లు గుర్తించి రూ.32.49 లక్షలు ఆదాయం వసూలు చేశారు. నగరంలో 228 షాపులకు అద్దెల రూపంలో రూ.403 లక్షలు రావాల్సి ఉండగా, ఆగస్టు నెలాఖరు నాటికి రూ.129.22 లక్షలు వసూలు చేశారు. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ 26 తేదీ లోపు మరో రూ.36.76 లక్షలు వసూలు చేయడం గమనార్హం. నీటి పన్ను డిమాండ్ రూ.610లక్షలు కాగా, ఆగస్టు నాటికి రూ.84.64 లక్షలు వసూలు అయ్యింది. మొత్తంగా నాలుగు నెలల కాలంలో పాత డిమాండ్ కాకుండా అదనంగా ఇళ్లు, షాపులు, ట్రేడ్ లైసెన్స్, నీటి పన్నులు విధించడం ద్వారా రికార్డు స్థాయిలో రూ.15కోట్లు పైగా పన్నులు వసూలు చేశారు.

37.84 లక్షలకు రైల్వేకు డిమాండ్ నోటీసు

భారతీయ రైల్వే సంస్థ (విజయనగరం) నుంచి సర్వీస్ ఛార్జీలు రాబట్టేందుకు కమిషనర్ నల్లనయ్య చేసిన కృషి సత్ఫలితాన్ని ఇవ్వబోతోంది. గత మూడేళ్లకు గాను రూ.28.54 లక్షలతో పాటు, ఈ ఏడాది సర్వీస్ ఛార్జీలు 9.29 లక్షలతో కలిపి మొత్తంగా రూ.37.84 లక్షలు చెల్లించాలని రైల్వే డిఆర్‌ఎంకు డిమాండ్ నోటీసు ఇవ్వడానికి సన్నద్ధమవుతున్నారు.

స్టిక్కర్లు ద్వారా పన్ను గుర్తింపు సులభతరం

రాష్ట్రంలో తొలిసారిగా ఏ మున్సిపాలిటీలోనూ ఇళ్లకు స్టిక్కర్లు అతికించి పన్నుల గుర్తింపును సులభతరం చేసే ప్రక్రియకు కమిషనర్ శ్రీకారం చుట్టారు. పన్ను వేసే ప్రతి ఇంటికీ స్టిక్కర్ అంటిస్తున్నారు. పన్ను వేయని ఇంటికి స్టిక్కర్ ఉండదు. దీంతో స్టిక్కర్ లేని ఇంటికి పన్ను వేసేందుకు సులభతరం కానుంది. అర్బన్ రీ సర్వే లో కూడా ఈ ప్రక్రియ సులభతరంగా సర్వే చేసేందుకు తోడ్పడుతుంది.

ఆదాయం పెరిగితేనే మెరుగైన సేవలు



పన్నుల వసూలుతో ఆదాయం పెంచుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది. నగరంలో నిర్మాణాలు, వ్యాపారాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అందుకు అనుగుణంగా పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాం. అందులో భాగంగానే ఇంటి ఇంటికి స్టిక్కర్లు ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. స్టిక్కర్ లేదంటే ఆ ఇంటికి లేదా వ్యాపార సంస్థలకు పన్ను లేనట్లే. నగర ప్రజలు పన్నులు చెల్లించి నగరాభివద్ధికి సహకరించాలి.

- పి.నల్లనయ్య
నగర పాలక సంస్థ కమిషనర్

కబడ్డీ విజేతలకు అభినందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో విజయనగరం జిల్లా జట్లు రెండో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కబడ్డీ క్రీడాకారులను ఆదివారం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ప్రభావతి, గోపాలరావు పాల్గొన్నారు.

అథ్లెట్లకు ఎమ్మెల్సీ ప్రశంసలు

రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్సీ రఘురాజు ప్రశంసించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 16 మంది మహిళలు, 34 మంది పురుషులు పాల్గొని, మొత్తం 144 పతకాలు సాధించారు. దీంతో స్థానిక రాజీవ్ గాంధీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వారిని అభినందించారు. త్వరలో జరిగే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో కూడా సత్తాచాటాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ, కోచ్ పొట్నూరు శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

విజయనగరం కోట : నగరంలో చలితో ఇబ్బంది పడుతున్న వృద్ధులకు లిఫ్టింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షులు కంది గౌరీశంకర్, ఉపాధ్యక్షులు సత్తి అచ్చిరెడ్డి, కోశాధికారి ఎ.వెంకటరావు.. దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదివారం తెల్లవారు జామున చలితో ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, వికలాంగులను గుర్తించి, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో అన్నదాన ట్రస్ట్ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి విష్ణు గాయత్రి, సభ్యులు కట్టా రమేష్, , వేణుపూర్ణిమ, రవి, శివ ప్రసాద్, చంద్రశేఖర్, ముత్యాలు, సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమ్మె ఉధృతం

సిఐటియు రాష్ట్ర నాయకులు టివి రమణ • 3వ రోజూ కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి-చీపురుపల్లి

పౌల్ట్రీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని సిఐటియు రాష్ట్ర నాయకులు టివి రమణ హెచ్చరించారు. మండలంలో కర్లాం గ్రామ సమీపంలో వెంకటరామ పౌల్ట్రీలో పనిచేస్తున్న కార్మికులు నూతన వేతన ఒప్పందం చేయాలని చేపట్టిన సమ్మె ఆదివారం మూడో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేసినా యాజమాన్యం మొండిగా వ్యవహరించడంతో అనివార్యంగా కార్మికులు సమ్మెలోకి దిగాల్సి వచ్చిందన్నారు. సమస్యలు పరిష్కరించకుండా పోలీసులతో భయపెట్టి, లొంగదీసుకొని వేతన ఒప్పందం ఎగ్గొట్టాలని యాజమాన్యం చూస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్మికుల ఐక్యత ముందు యాజమాన్యం పప్పులు ఉడకవని స్పష్టంచేశారు. యాజమాన్యం ఇదే మొండి వైఖరితో ఉంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యాజమాన్యం పంతానికి పోకుండా ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అంబళ్ల గౌరినాయుడు, ఇప్పిలి గురినాయుడు, ఈశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి-విజయనగరం కోట



పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు కోదండరామ్


గ్రామ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు చిల్లపేట సర్పంచ్ బూర్లి దేవి ప్రసన్న, టిడిపి నాయకులు కోదండరామ్ తెలిపారు. చిల్లపేట గ్రామంలో ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. రూ.33 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రూ.4.55 లక్షలతో 63 మీటర్ల మేర సిసి రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రూ.3.80 లక్షలతో 52 మీటర్ల పొడవైన డ్రెయిన్లు, రూ.2.30 లక్షలతో 33 మీటర్లు రోడ్లు, డ్రెయిన్లు, రూ.4.50 లక్షలతో 62 మీటర్ల రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా రోడ్లను వదిలేసిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్లకు మహర్దశ పట్టిందని, అతి తక్కువ కాలంలోనే సిసి రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తుందని తెలిపారు.

సరుకులు పక్కదారి పడితే కఠిన చర్యలు

రేషన్ సరుకులు పక్కదారి పడితే సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలకు వెనుకాడేది లేదని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి (డిఎస్ఒ) కె.మధుసూదనరావు హెచ్చరించారు. జిల్లాలోని తెల్లరేషన్ కార్డుదారులందరికీ ప్రభుత్వం ఉచితంగానే బియ్యం పంపిణీ చేస్తోందన్నారు. దీంతోపాటు కందిపప్పు, పంచదార కూడా పంపిణీ జరుగుతోందని తెలిపారు. అందరికీ సరుకులు అందుబాటులో ఉండేందుకు వీలుగా ఖాళీగా ఉన్న డీలర్ పోస్టులు భర్తీచేయడంతోపాటు జనాభా ప్రాతిపదికన అదనపు డీలర్ పోస్టులు కూడా భర్తీకి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం తరపున మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారెంటీలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...


– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

- ప్రతి నెలా 9,200 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ
- రేషన్ డీలర్ల భర్తీకి చర్యలు
- ధాన్యం మిల్లుల నుంచి రూ.252 కోట్ల బ్యాంకు గ్యారెంటీ
- 'ప్రజాశక్తి'తో డిఎస్ఒ కె.మధుసూదనరావు ముఖాముఖి



చౌకధరల దుకాణాల ద్వారా ఏయే సరుకులు పంపిణీ చేస్తున్నారు.?

తెల్ల రేషన్‌కార్డుదారు కుటుంబంలో ప్రతి మనిషికి 5 కిలోల చొప్పున ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోంది. కార్డులో నమోదైన వారికి మాత్రమే ఇది వర్తిస్తుంది. అరకేజీ పంచదార, కేజీ కందిపప్పు కూడా ఇస్తున్నాం. ఇంటింటికీ వచ్చే రేషన్ వాహనంలో కార్డుదారులు ఈ మూడు సరుకులూ తీసుకోవచ్చు. ఇలా కార్డుదారులతోపాటు మధ్యాహ్న భోజన పథకానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ వసతి గృహాలకు కలిపి జిల్లా వ్యాప్తంగా 9,200 మెట్రిక్ టన్నుల బియ్యం నెల నెలా పంపిణీ జరుగుతోంది.



జిల్లాలో ఎన్ని తెల్లరేషన్‌కార్డులు ఉన్నాయి.?

జిల్లా వ్యాప్తంగా 5,81,665 తెల్లరేషన్‌కార్డులు ఉన్నాయి. వీరందరికీ సరిపడా సరుకులు వస్తున్నాయి. సరుకులు ఎక్కడైనా తీసుకోవచ్చు. సరుకులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటున్నప్పటికీ వలస కూలీలు, ఇతర ప్రాంతాలకు తాత్కాలికంగా వెళ్లినవారు ఆయా ప్రాంతాల్లో తీసుకున్నప్పుడు ఆ మేరకు సరుకులు నిల్వ ఉండిపోతున్నాయి. సీజన్ వారీగా ఈ మేరకు హెచ్చుతగ్గులు ఉంటున్నాయి.

సరుకులు పక్కదారి పడుతున్నాయన్న విమర్శలపై మీ స్పందన ఏమిటి.?

మన జిల్లాలో అటువంటి పరిస్థితి లేదు. సరుకులు పక్కదారి పట్టే పరిస్థితి లేకుండా విజిలెన్స్ నిఘా ఉంది. ఎప్పటికప్పుడు దుకాణాల్లోని సరుకులు, రికార్డులను స్వయంగా నేనే తనిఖీ చేస్తున్నాను. ఈ నెలలో నాలుగు కేసులు కూడా నమోదు చేశాం. కేసు తీవ్రతను బట్టి చర్యలు తీసుకుంటాం.

రేషన్ డీలర్ పోస్టులు ఎన్ని ఖాళీగా ఉన్నాయి.?

జిల్లా వ్యాప్తంగా 1247 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. వీటిలో డీలర్ పోస్టులు 70 వరకు ఖాళీగా ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన కొత్తగా మరో 41 దుకాణాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. మొత్తం వీటన్నింటికీ రెవెన్యూ డివిజన్ల వారీగా ఇప్పటికే ఆర్‌డిఒలు నోటిఫికేషన్లు జారీచేశారు. ఇంటింటికీ సరుకులు తీసుకెళ్లే వాహనాలు 370 వరకు ఉన్నాయి.

జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యం ఎంత.?

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం లక్ష్యంగా నిర్ణయించింది. ఇందులో ఇప్పటి వరకు 2 లక్షల టన్నుల మేర సేకరించాం. ఇందుకోసం 151 ధాన్యం మిల్లుల నుంచి రూ.252 కోట్ల మేర బ్యాంకు గ్యారెంటీలు తీసుకున్నాం. ఇటీవల కురిసిన వర్షాల వల్ల ధాన్యం క్రయ, విక్రయాల విషయంలో కొంతమేర జాప్యం జరిగింది. త్వరలోనే లక్ష్యానికి అనుగుణంగా సేకరణ పూర్తిచేస్తాం.

బాధితులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

సంతకవిటి: అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. మండలంలోని సిరిపురం పొందర వీధిలో శనివారం జరిగిన అగ్నిప్రమాద బాధితులను ఆదివారం వారు పరామర్శించారు. అగ్ని ప్రమాదంలో మంచిరెడ్డి ఈశ్వరి అనే యువతికి వివాహం నిమిత్తం దాచిపెట్టిన సొమ్ము, బంగారం, బట్టలు కాలిపోవడంతో స్పందించిన ఎమ్మెల్యే యువతి పెళ్లి నిమిత్తం రూ.2లక్షలు ఆర్థిక సాయం చేశారు. మిగిలిన ప్రతి ఇంటికీ రూ.పదివేలు చొప్పున సాయం అందించారు. వీటితో పాటు బాధితులకు బియ్యాన్ని అందజేశారు. ఎమ్‌పి కూడా తన సహాయార్థం బాధితురాలికి రూ. లక్ష సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత ఇల్లు లేని పేదలకు ఇల్లా స్థలాల్ని అందజేస్తామన్నారు. పూరి గుడిసెలు లేని నియోజకవర్గమే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు. రోడ్డున్న పడ్డ ఈ కుటుంబాలను సిఎం చంద్రబాబు దృష్టిలో పెట్టి టిడ్కో ఇల్లు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు

నెల్లిమర్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు ఆదివారం వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో శాంతి పరిరక్షణ మీద, దొంగతనాలు మీద ప్రత్యేకమైన దృష్టి పెట్టాలని సూచించారు. గంజాయి, మహిళలపై నేరాలు ఇతర అసాంఘిక కార్యక్రమాల పట్ల ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. గంజాయి నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కాగా స్టేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏఎస్‌ఐ మూర్తి, ఇతర సిబ్బందికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ వార్షిక తనిఖీల్లో సిఐ రామకృష్ణ, ఎస్ఐ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన రాము

దత్తిరాజేరు: జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడిగా చేయూత ఫౌండేషన్ సొసైటీ అధ్యక్షులు రాము నియమితులైన సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. చేయూత ఫౌండేషన్ సొసైటీ అధ్యక్షుల ఎం. రాము చేయూత ఫౌండేషన్ చేస్తున్న విశేషమైన సేవలను గుర్తిస్తూ ఈ అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు బెజవాడ రామానాయుడు, బెజవాడ బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత

వేపాడ: మండలంలోని సోంపురం జంక్షన్ నుంచి అరిగిపాలెం, జగ్గయ్యపేట, ఆకుల సీతంపేట, వల్లంపూడి, వేపాడ వరకు ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. దీనిపై ఇటీవల ప్రజాశక్తిలో వెలువడిన కథనానికి స్పందించిన అధికారులు ఎట్టకేలకు ఆదివారం రోడ్డుకు పడిన గోతులను ఊడ్చే పనులు శర వేగంగా సాగుతున్నాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాగావళి ఒడ్డున సినిమా షూటింగ్

రేగిడి: మండలంలోని సంకిలి నాగావళి నది ఒడ్డున మలయాళం రామి అనిషాన్ అనే 70 ఎంఎం మూవీ షూటింగ్ ఆదివారం జరిగింది. ప్రసాదన్ అనే మలయాళ దర్శకుడు, నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాలో నాగావళి ఒడ్డున 78 మంది ఆర్టిస్టులతో అంత్యక్రియల సీను సెట్ వేశారు. హీరో ప్రఫ్లో ప్రభో, ముగ్గురు హీరోయిన్లతో రెండు రోజులపాటు షూటింగ్ చుట్టుపక్క ప్రాంతాల్లో జరగనున్నట్లు తెలిపారు. షూటింగ్ వద్దకు పాలకొండ రేగిడి మండలాలకు చెందిన ప్రజలు వచ్చి సినీ నటులను చూసేందుకు ఎగబడ్డారు.

అన్ని వర్గాలకు సందేశం ఇచ్చే మంచి సినిమా

రామి అనిషాన్ అనే 70 ఎంఎం వెండి తెర మలయాళ సినిమా అన్ని వర్గాలకు సందేశం ఇచ్చే మంచి సినిమాగా గుర్తింపు వస్తుందని దర్శక నిర్మాత ప్రసాదన్ తెలిపారు. ఇటు యువతకు, అటు కుటుంబ నేపథ్యం, అన్ని వర్గాలకు ఆకర్షించే ఈ సినిమాకు టీం కష్టపడి పనిచేస్తున్నాం అన్నారు. ఆంధ్రాలో మంచి లొకేషన్ ఉన్నాయని, ఇందులో భాగంగా ఇక్కడ షూటింగ్ చేస్తున్నామన్నారు. రెండు రోజుల పాటు షూటింగ్‌కు అధికారుల అనుమతులు తీసుకున్నామని వెల్లడించారు.

యుటిఎఫ్ కేలెండర్ ఆవిష్కరణ

బొబ్బిలి: స్థానిక కోటలో ఆదివారం ఎమ్మెల్యే బేబినాయన యుటిఎఫ్ కేలెండర్‌ను ఆవిష్కరించారు. విద్యారంగంలో యుటిఎఫ్ కృషి అభినందనీయమని బేబినాయన అన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పిడిఎఫ్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి, యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, మధుసూదనరావు, సత్యనారాయణ, శశిభూషణరావు, రామకృష్ణ, రాము, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడోలో గోల్డ్ మెడల్

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లి మహాత్మా జ్యోతిభాపూలే బిసి గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కర్రి దిలీప్ రాష్ట్ర స్థాయి జూడో పోటీలలో గోల్డ్ మెడల్ సాధించాడు. గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి మహారాష్ట్రలో ఈనెల 18,19,20,21న జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ జి.పురుషోది, పిఇటి అప్పలనాయుడు చెప్పారు. దిలీప్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

వింత వ్యాధితో గొర్రెలు మృతి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఉంగరాడ గ్రామానికి చెందిన ఇప్పిలి వీరబాబుకు సంబంధించిన గొర్రెలు వింత వ్యాధితో మృతి చెందాయి. గత వారం రోజులుగా రోజుకు 5 నుంచి 10 గొర్రెలు వింత వ్యాధితో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోధిస్తున్నారు. ఇప్పటికే 55 వరకు గొర్రెలు మృతి చెందినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ దృష్టికి తీసుకు వెళ్తానని టిడిపి నాయకులు చల్ల భుజంగరావు తెలిపారు.

200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి-బొబ్బిలి

రామభద్రపురం మండలం జోగేందర్ వలసలో 200 లీటర్ల నాటుసారా కోసం నిల్వ చేసిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. గ్రామంలో నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు చెప్పారు. నాటుసారా తయారు చేసిన, అమ్మిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడిలో ఎస్ఐ శ్రావణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మోపాడ పిహెచ్‌సిలో అందని వైద్యం

● ఆస్పత్రిలో కానరాని వైద్య సిబ్బంది ● ఇబ్బంది పడుతున్న రోగులు ● పట్టించుకోని అధికారులు

పేద ప్రజలకు వైద్యం అందించాలనే లక్ష్యంతో పభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పిహెచ్‌సిల్లో వైద్యం అందక పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిల్లో అన్ని సౌకర్యాలూ కల్పించామని, ప్రయివేటు ఆస్పత్రుకు వెళ్లనవసరం లేదని రాజకీయ నాయకులు చెబుతున్నా దానికి అనుగుణంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందడం లేదు. ముఖ్యంగా ఆస్పత్రిల్లో అందుబాటులో ఉండి వైద్యం అందించాల్సిన సిబ్బంది అలసత్వం వల్ల ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఆస్పత్రిలో అందుబాటులో ఉంటూ వైద్యం అందించాలన్న నిబంధనలకు వైద్య సిబ్బంది తిలోదకాలు ఇస్తున్నారు. ఆస్పత్రిలో వైద్యం సిబ్బంది ఉండకపోవడంతో రోగులకు సకాలంలో వైద్యం అందడం లేదు. దీంతో పిహెచ్‌సికి వెళ్లేందుకు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి పేదలకు సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోపాడ పిహెచ్‌సిలో రోగులకు వైద్యం కరువైంది. వైద్యం కోసం వచ్చిన రోగులను


వైద్యుల కోసం ఆస్పత్రిలో ఎదురు చూస్తున్న రోగులు

పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తంచ చేస్తున్నారు. మండలంలో ఒకప్పుడు మోపాడలో మాత్రమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండేది ఇప్పుడు మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మండల కేంద్రంలో ఉంది. మండలంలో 26 పంచాయతీలు 52 గ్రామాలు ఉన్నాయి. మోపాడ పిహెచ్‌సి పరిధిలో మోధవలస, కొండరాజుపేట, జి.తాళ్లవలస, ఆకులపేట, జొన్నాడ, బొడ్డవలస, చింతలవలస, రఘుమండ, అమకం, వెదుళ్లవలస పంచాయతీలున్నాయి. దీంతో ఇక్కడ రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడు వైద్యం అందకపోవడంతో రోగులు ఈ పిహెచ్‌సికి వచ్చేందుకు సముఖత చూపడం లేదు. ఒక వేళ వెళ్లినా వైద్యం అందడం లేదని ఎవరూ ఉండటం లేదని రోగులు చెబుతున్నారు. ఈ ఆరోగ్య కేంద్రం మొదటి నుంచి 24 గంటలు పనిచేసే విధంగా ఏర్పాటు చేశారు. కానీ రాత్రులు సమయంలో ఆసుపత్రిలో ఎవరు ఉండడం లేదని రోగులు అంటున్నారు. ఒకవేళ రాత్రి సమయంలో వెళ్లిన వైద్యం చేయడం లేదని మోపాడ గ్రామస్తులే చెబుతున్నారు. ఈ విషయాన్ని గ్రామ సభలో కూడా ప్రజలు అడిగినట్లు సమాచారం. అయితే ఆ సమావేశానికి పిహెచ్‌సి తరఫున ఎవరూ హాజరు కాకపోవడం గమనార్హం.

మోపాడ పిహెచ్‌సిలో పివివి యోగితిబాల, శరణ్య అనే డాక్టర్లు పనిచేస్తున్నారు. వీరిలో ఒకరు 104తో వివిధ గ్రామాలకు వెళుతుంటారు. ఒకరు ఆరోగ్య కేంద్రంలో రోగులకు వైద్య సేవలు అందిస్తూ ఉండాలి. కానీ ఇక్కడ ఉదయం వచ్చి హాజరు వేసుకొని ఆరోగ్య కేంద్రంలో ఎవరినో ఒకరిని ఉంచి 11 గంటలు తరువాత బయటకు వెళ్లిపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వైద్యం కోసం వెళ్లిన రోగులకు వైద్యం అందడం లేదని సిబ్బంది మాత్రలు ఇచ్చి పంపించేస్తున్నారని రోగులు వాపోతున్నారు. వైద్యం అందకపోవడం, వైద్య ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం వంటి విషయాలపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులతో పాటు, సర్పంచ్ భర్త బడ్డుకొండ రమేష్‌నాయుడు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ఈ ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిపై దృష్టి పెట్టి రోగులకు వైద్య సేవలు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు

పిహెచ్‌సిలో వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని గ్రామస్తులు ఆరోపించని దాంట్లో వాస్తవం లేదు. అందరం సమయానికి వచ్చి ఆస్పత్రిలో ఉండి సమయం పూర్తయిన తరువాతే ఇంటికి వెళుతున్నాం. ఈ ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులున్నారు. అందులో ఒకరు 104 వాహనంలో గ్రామాల్లో వెళ్లి వైద్యం అందిసుంటే, మిగిలిన వ్యక్తి ఆస్పత్రిలో రోగులకు వైద్యం అందిస్తున్నారు.

యోగిత బాల, వైద్యాధికారి, మోపాడ పిహెచ్‌సి

సమస్యలపై పోరాటానికి ఎస్ఎఫ్ఐ కృషి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

విద్యారంగ సమస్యలపై పోరాటానికి ఎస్ఎఫ్ఐ కృషి చేస్తోందని ఆ కమిటీ జిల్లా సహయ కార్యదర్శి పి. రమేష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఆశ్రమ పాఠశాలలో స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం జెండాను ఎస్ఎఫ్ఐ కమిటీ కార్యదర్శి ప్రకాష్ ఎగరవేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.రమేష్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నెల్లిమర్ల నియోజవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని దానికి అనుగుణంగా భవిష్యత్తులో పోరాటాలు రూపొందిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె. రవికుమార్, పాఠశాల కమిటీ సభ్యులు, పాఠశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


నెల్లిమర్ల: నినాదాలు చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

శృంగవరపుకోట: ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం పట్టణంలోని పలు సంక్షేమ హాస్టళ్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు జి. చైతన్య, మండల గర్ల్స్ కన్వీనర్ ఏ. అణు పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా జాయింట్ సెక్రటరీ కే. రాజు మాట్లాడుతూ ఎస్.కోట పరిధిలో ఉన్న ఎస్‌సి, బిసి సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కే. రమేష్, జిల్లా కమిటీ సభ్యులు వి.భారతి, అను, ప్రెసిడెంట్ చైతన్య, మండల కమిటీ సభ్యులు రత్న, వి.చరణ్, జి.అనిత పాల్గొన్నారు.

కొత్తవలస: మండల కేంద్రంలోని సంక్షేమ హాస్టల్స్‌లో నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వి. భారతి మాట్లాడుతూ దేశం కోసం తృణ ప్రాయంగా ప్రాణాలర్పించిన 8వ తరగతి విద్యార్థి నిరంజన్ తాలూక్ దార్ స్ఫూర్తితో నేటికీ అలుపెరుగని పోరాటాలు సాగిస్తున్నామన్నారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం నెలరోజుల్లో విడుదల చేస్తామన్న ఉపకార వేతనాలు ఇప్పటికి విడుదల చేయలేదని తక్షణమే విడుదల చేయాలని, సంక్షేమ హాస్టల్లో మెస్ చార్జీలు ధరలకు అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా వైస్ ప్రెసిడెంట్ రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు జి.చైతన్య, మండల కార్యదర్శి డి. గణేష్ పాల్గొన్నారు.

దశాబ్దాల ఇక్కట్లకు తెర

●గుర్ల గెడ్డపై కల్వర్టు నిర్మించిన ఎటోర్ సంస్థ ● ప్రారంభించిన జిసిసి చైర్మన్

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని గుర్ల గ్రామం వద్ద గెడ్డపై ఎట్టకేలకు కల్వర్టు ప్రారంభమైంది. ఇక్కడి గెడ్డపై కల్వర్టు లేక దశాబ్దాలుగా అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ గెడ్డ ఆవల ఉన్న వ్యవ సాయ భూములకు వెళ్లివచ్చేందుకు రైతుల అవస్థలు వర్ణనాతీతం. పంట ఉత్పత్తులు తెచ్చుకోడానికి అనేక వ్యయ ప్రయాసలకు గురయ్యేవారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులకు గురయ్యేవారు. గెడ్డ ఉధృతి సమయంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయేవి. ఈ గెడ్డ అవతల ఉండే అనంతగిరి మండల సుమారు 10 గ్రామాలవారు, మెంటాడ మండలం పనుకువానివలస, శిలకన్నవలస గిరిజ నులు కూడా తీవ్ర ఇక్కట్లు పడేవారు. ఎన్నోసార్లు కల్వర్టు నిర్మించాలని కోరినా ఫలితంల లేకుండా పోయింది.


కల్వర్టును ప్రారంభిస్తున్న జిసిసి చైర్మన్ శ్రవణ్ కుమార్

గత వైసిపి హయాంలో నిధులు మంజూ రైనా పనులు జరగలేదు. కాగా అనంతగిరి మండల పరిధిలో ఇటీవల వెంచర్లు వేసిన ఏటోర్ ప్రైవేటు సంస్థ రాకపోకలు, రవాణా నిమిత్తం రూ.50లక్షలతో పైపు కల్వర్టు నిర్మించింది. దీన్ని, మాజీమంత్రి, జిసిసి చైర్మన్ కిడారి శ్రవణ్ కుమార్ ఆదివారం ప్రారంభి ంచారు. ఇన్నేళ్లకు ఇక్కట్లు తొలగాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎటోర్ గ్రూప్‌ల సంస్థ ఫౌండర్, సిఇఒ బి.నగేష్, రొంపిల్లి సర్పంచ్ చిరంజీవి, బొద్దాన జగదీష్ పుర్నాన అప్పన్న పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి- బొండపల్లి

అన్ని రంగాలలో ఉత్తరాంధ్ర అభివృద్ధికి, యువత ఉపాధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఈ మేరకు ఐకమత్యంతో గ్రామాలు ముందుకు వచ్చి సిఎం చంద్రబాబుకు మద్దతుగా నిలబడవలసిన అవసరం ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రజలకు పిలుపు నిచ్చారు. ఆదివారం మండలంలోని బిళ్లలవలస గ్రామ సర్పంచ్ దంపతులు నెట్టి ఏసురత్నం, ముకుంద, మాజీ సర్పంచ్‌లు నెట్టి ఆనందరావు, బూర్లె అనురాధ, మాజీ ఉప సర్పంచ్ కడగల కొండమ్మ, ముగ్గురు వార్డు సభ్యులతో పాటు 250 కుటుంబాలు, బొండపల్లి పంచాయతీలో గల గొల్లలపేట గ్రామానికి చెందిన పలు కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్, మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావులు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యుల నడ్డి విరిచారని గుర్తు చేశారు. పైగా టిడిపి కూటమి ఛార్జీలను పెంచినట్లు ప్రచారం చేస్తూ నిరసన ర్యాలీలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఇటువంటి బూటకపు నిరసనలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ప్రతి ఒక్క విషయాన్ని జనం పరిశీలిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కోరాడ కృష్ణ, మాజీ వైస్ ఎంపిపి బొడ్డు రాము, సర్పంచ్‌లు నంబూరి రాజేష్, కర్రోతు శ్రీనివాసరావు, మీసాల జానకి రావు, ముదునూరు శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - వంగర

అన్నమయ్య జిల్లా దళితుడైన గాలివీడు ఎంపిడిఒ జవహర్ బాబుపై విచక్షణ రహితంగా దాడి చేసిన సుదర్శన్ రెడ్డితో సహ మిగతా వారిపై విచారణ జరిపి అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగుల రక్షణ కల్పించాలని దళిత బహుజన ఉత్తరాంధ్ర జెఎసి నాయకులు మజ్జి గణపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు వంగరలో వారు ఆదివారం మాట్లాడుతూ గాలివీడు ఎంపిడిఒ విధి నిర్వహణలో ఉండగా కార్యాలయానికి తాళం వేయడమే కాకుండా విచక్షణారహితంగా దాడి చేసి గాయపరచడం అత్యంత పాసవిక చర్య అని అన్నారు. దళిత గిరిజనులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో దళిత బహుజన సంఘాలు జెఎసి నాయకులు ఎం.గణపతి రావు, ద్రు రాంబాబు, కారు రామారావు, డాక్టర్ తిర్లంగి సింహాచలం, చిత్రిరి గంగులు, యజ్జల అప్పలస్వామి, సిరి రాజు, యజ్జల సుధీర్, చిన్న, కొప్పర భుజంగరావు, గొంగడ గంగయ్య, సింహాచలం, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడుకు మద్దతిస్తున్నట్లు ఎపిటిఎఫ్ (1938) రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎ.సదాశివరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి ప్రకటించారు. ఆదివారం నగరంలోని ఓ ప్రయివేటు హోటల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీనివాసులు నాయుడుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆప్టా సంఘం కూడా ఆయనకు మద్దతు తెలియజేసింది. సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షులు సిహెచ్.దిలీప్ కుమార్, ఉపాధ్యకులు డి.ఈశ్వరరావు, ఉపాధ్యాయ ప్రగతి సంపాదకులు ఎ.ఎస్.నాయుడు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.బలరాం నాయుడు, ఎన్.వి పైడిరాజు, పాల్గొన్నారు.

మన భవిష్యత్తు మన చేతిలోనే..

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మన భవిష్యత్తు మన చేతిలో ఉంటుందని, దానిని జాగ్రత్తగా తీర్చిదిద్దుకోవాలని జన విజ్ఞాన వేదిక జాతీయ విద్యా కమిటీ కన్వీనర్ ఎ.వి రాజశేఖర్ అన్నారు. జెవివి జిల్లా అధ్యక్షులు ఎరుకొండ ఆనంద్ ఆధ్వర్యంలో గురజాడ పాఠశాలలో ఆదివారం పోటీ పరీక్షల అభ్యర్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే తప్పకుండా విజయం సాధిస్తారని తెలిపారు. జెవివి జాతీయ అధ్యక్షులు ఎంవిఆర్ కృష్ణాజి మాట్లాడుతూ పరీక్షలను భయంతో కాకుండా, ఇష్టంతో రాయాలని సూచించారు. కార్యక్రమంలో జెవివి జాతీయ ఉపాధ్యక్షులు జి.లక్ష్మణరావు, కార్యదర్శులు జి.అప్పలనాయుడు, పైల రమేష్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, నగర అధ్యక్షులు షణ్ముఖరావు, జెవివి యువజన అధ్యక్షులు శనపతి ఈశ్వరరావు, దుర్గారావు, గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

దిగబడిన చెరుకు ట్రాక్టర్

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం ప్రధాన రహదారిపై చెరుకు ట్రాక్టర్ ఆదివారం దిగబడింది. అక్కడ రెండు రోజులు క్రితం తాగునీటి పైపులైను పనులు చేపట్టి రోడ్డును పూడ్చారు. దీంతో భారీ లోడుతో వస్తున్న చెరుకు ట్రాక్టర్ దిగబడడంతో స్థానికులు ఒక్కసారిగా భయంతో పరుగులు తీశారు. కొంత సమయం ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మరొక ట్రాక్టర్ సాయంతో గోతిలో పూడుకుపోయిన ట్రాక్టర్‌ను బయటకు తీశారు. నిత్యం భారీ లోడ్లతో ట్రాక్టర్లు ప్రమాదకరంగా వెళ్తున్నాయని, అధికారులు స్పందించి భారీ లోడ్లతో వెళ్తున్న ట్రాక్టర్లపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జరజాపుపేటలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజపేటలో సాధన యువజన సంఘం మెగా రక్త దాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించింది. గరివిడి ఎంఇఒ పోలుబోతు రామారావు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ యువత సేవా కార్యక్రమాల వైపు మొగ్గు చూపాలని సాధన యువజన సంఘాన్ని ఆదర్శంగా తీసుకుని మరికొన్ని యువజన సంఘాలు ఏర్పాటు చేసి యువత సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనం తరం వైద్యులు అవనాపు భానుప్రకాష్ రక్తదానంపై యువతకి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. శిబిరంలో 48మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మద్దిల సన్యాసిరావు మాస్టా రుని, ఎన్‌టిఆర్ బ్లడ్ బ్యాంకు ఇంచార్జి ఆనంద్‌ని గ్రామ పెద్దలు, సాధన యువజన సంఘం కలిసి సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు అవనాపు సత్యనా రాయణ, ఎంఎం నాయుడు, తుమ్ము వెంకట రమణ, కాళ్ల రాజ శేఖర్, అవనాపు మురళీకృష్ణ, సాధన యువజన సంఘం అధ్య క్షులు పోలుబోతు దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు బెల్లాన వెంకట రావు, ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ పాల్గొన్నారు.

లొట్లపల్లిలో రక్తదాన శిబిరానికి స్పందన

జామి: లొట్లపల్లిలో రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. గ్రామ నాయకుడు, సర్పంచ్ భర్త యువ న్యాయవాది జన్నెల నూరిదేముడు జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో ఆదివారం గ్రామ యువకులంతా కలిసి రక్తదాన శిబిరాన్ని నిర్వహి ంచారు. స్థానిక రామాలయం ఆవరణలో నిర్వహించిన ఈ శిబిరాన్ని మండల వైసిపి అధ్యక్షుడు గొర్లె రవికుమార్ ప్రారంభించారు. మొత్తం 35 మంది రక్తదానం చేసి శిబిరాన్ని విజయవంతం చేసారు. విజయనగరానికి చెందిన న్యూ లైఫ్ బ్లడ్ సెంటర్‌కు చెందిన నిపుణులు రక్తాన్ని దాతల నుంచి సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సబ్బవరపు అరుణ, మండలంలోని పలు గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు సబ్బవరపు వాసు, స్థానిక గ్రామ యువత సిడగ రాజు పాల్గొన్నారు.

క్రీడల పట్ల యువత ఆసక్తి పెంచుకోవాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

క్రీడల పట్ల యువత ఆసక్తి పెంచుకోవాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన పిలుపు నిచ్చారు. ఆటల్లో స్ఫూర్తిని ప్రదర్శించి గెలుపు, ఓటమిలు సమానంగా తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీ యూత్ నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్-2 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో నైపుణ్యం సాధించడం ద్వారా ఎన్నో విజయాలు సాధించవచ్చునని తెలిపారు. మండల కేంద్రంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రాంగణం ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువకులు క్రీడల్లో ప్రతిభ సాధించాలన్నారు. అనంతరం టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రికెట్ బ్యాట్ పట్టుకొని క్రికెట్ ఆడారు. అనంతరం పార్వతీపురం, బొబ్బిలి టీము సభ్యులను పరిచయం చేసుకున్నారు.ఈ క్రీడా ప్రాంగణంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోడూరు షణ్ముఖ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, మేజర్ పంచాయతీ సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు కరణం విజయభాస్కరరావు, ఎస్ఐ వెలమల ప్రసాదరావు, టోర్నమెంట్ నిర్వాహకులు కొల్లి భాస్కరరావు, బెల్లాన క్రాంతి కుమార్, రాందేవ్, బెల్లాన రవి కుమార్ శ్రీరాం నగర్ కాలనీ యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టెక్ ఉత్సవ్-2025 పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని బసవపాలెం అవంతి పాలిటెక్నిక్ కళాశాలలో టెక్ ఉత్సవ్ 2025 కనెక్టింగ్ విత్ ఫ్యూచర్ సదస్సును జనవరి 3వ తేదీన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను అవంతి కళాశాల వ్యవస్థాపక చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సాంకేతిక, సృజనాత్మకత పరిజ్ఞానం ప్రాముఖ్యతను పెంపొందించడానికి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అధిరోహించడాని ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ సదస్సులో ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్ క్విజ్ కాంపిటేషన్ వంటి పోటిలు ఉంటాయని తెలిపారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రథమ బహుమతి రూ. 10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అవంతి కళాశాల ప్రతినిధి ముత్తంశెట్టి మహేష్, అవంతి కళాశాల హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎ. చంద్రశేఖర్, అవంతి పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్. మల్లేశందొర, అవంతి రీసెర్చ్ అండ్ టెక్నాలజికల్ అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. గోవిందరావు, పరిపాలన అధికారి జి.అశోక్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కే. భాస్కర్ రావు, పాలిటెక్నిక్ కాలేజ్ వైస్ వైస్ ప్రిన్సిపల్ లికే హేమ, వివిధ విభాగాల అధిపతులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన
శ్రీ మహారాశ్రీ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, రాజాం, వారి కోర్టులో
CC.No. 325/2018

ఫిర్యాది – మల్లిక గోపాలకృష్ణ
మరియు –
ముద్దాయి – టంకాల శ్రీరాం
టు,
టంకాల శ్రీరాం, తండ్రి రమణ, వ్యాపారం, మందరాడ గ్రామం, సంతకవిటి మండలం, సంతకవిటి P.S Limits, విజయనగరం జిల్లా.

పై నెంబరు CC.No. 325/2018లో శ్రీ కోర్టు వారు పై ముద్దాయి అయిన మీకు చాలా పర్యాయములు, కోర్టు సమన్లు పంపించిన మీరు తపాలాశాఖ వారిని మరియు పోలీసు వారికి దొరకకుండా ఉద్దేశ్యపూరకంగా తప్పించుకుంటూ యున్నారు. కావున శ్రీ కోర్టు వారు ఈ బహిరంగ ప్రకటన ద్వారా మీపై గల పై కేసు తే. 03.02.2025 దికి వాయిదావేయబడినదని ఈ బహిరంగ ప్రకటన మూలంగా మీకు తెలియజేయుచున్నాము. కావున **తే.03.02.2025 దిన** గానీ ముందుగా గానీ **ఉదయం 10.30 ని॥**లకు పైన పేర్కొన్న శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ వాదనను వినిపించవలసిందిగా కోరడమైనది. లేని యెడల మీపై పరోక్షంగా Civil & Criminal చర్యలు తీసుకొనబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

పై విషయము శ్రీ మహారాశ్రీ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, రాజాం వారి ఆదేశం మేరకు బహిరంగ ప్రకటన యివ్వడం జరిగినది.

ఎ. సత్యన్నారాయణ
అడ్వకేట్,
సెల్ నెం. 9949176936,
రాజాం

బహిరంగ ప్రకటన
శ్రీ మహారాశ్రీ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, రాజాం, వారి కోర్టులో
CC.No. 193/2018

ఫిర్యాది – కాళ్ల లక్ష్మణరావు
మరియు –
ముద్దాయి – టంకాల శ్రీరాం
టు,
టంకాల శ్రీరాం, తండ్రి రమణ, వ్యాపారం, మందరాడ గ్రామం, సంతకవిటి మండలం, సంతకవిటి P.S Limits, విజయనగరం జిల్లా.

పై నెంబరు CC.No. 193/2018లో శ్రీ కోర్టు వారు పై ముద్దాయి అయిన మీకు చాలా పర్యాయములు, కోర్టు సమన్లు పంపించిన మీరు తపాలాశాఖ వారిని మరియు పోలీసు వారికి దొరకకుండా ఉద్దేశ్యపూరకంగా తప్పించుకుంటూ యున్నారు. కావున శ్రీ కోర్టు వారు ఈ బహిరంగ ప్రకటన ద్వారా మీపై గల పై కేసు తే. 03.02.2025 దికి వాయిదావేయబడినదని ఈ బహిరంగ ప్రకటన మూలంగా మీకు తెలియజేయుచున్నాము. కావున **తే.03.02.2025 దిన** గానీ ముందుగా గానీ **ఉదయం 10.30 ని॥**లకు పైన పేర్కొన్న శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ వాదనను వినిపించవలసిందిగా కోరడమైనది. లేని యెడల మీపై పరోక్షంగా Civil & Criminal చర్యలు తీసుకొనబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

పై విషయము శ్రీ మహారాశ్రీ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, రాజాం వారి ఆదేశం మేరకు బహిరంగ ప్రకటన యివ్వడం జరిగినది.

ఎ. సత్యన్నారాయణ
అడ్వకేట్,
సెల్ నెం. 9949176936,
రాజాం

బహిరంగ ప్రకటన
శ్రీ మహారాశ్రీ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, రాజాం, వారి కోర్టులో
CC.No. 320/2018

ఫిర్యాది – బెవర కృష్ణమోహన్
మరియు –
ముద్దాయి – టంకాల శ్రీరాం
టు,
టంకాల శ్రీరాం, తండ్రి రమణ, వ్యాపారం, మందరాడ గ్రామం, సంతకవిటి మండలం, సంతకవిటి P.S Limits, విజయనగరం జిల్లా.

పై నెంబరు CC.No. 320/2018లో శ్రీ కోర్టు వారు పై ముద్దాయి అయిన మీకు చాలా పర్యాయములు, కోర్టు సమన్లు పంపించిన మీరు తపాలాశాఖ వారిని మరియు పోలీసు వారికి దొరకకుండా ఉద్దేశ్యపూరకంగా తప్పించుకుంటూ యున్నారు. కావున శ్రీ కోర్టు వారు ఈ బహిరంగ ప్రకటన ద్వారా మీపై గల పై కేసు తే. 03.02.2025 దికి వాయిదావేయబడినదని ఈ బహిరంగ ప్రకటన మూలంగా మీకు తెలియజేయుచున్నాము. కావున **తే.03.02.2025 దిన** గానీ ముందుగా గానీ **ఉదయం 10.30 ని॥**లకు పైన పేర్కొన్న శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ వాదనను వినిపించవలసిందిగా కోరడమైనది. లేని యెడల మీపై పరోక్షంగా Civil & Criminal చర్యలు తీసుకొనబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

పై విషయము శ్రీ మహారాశ్రీ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, రాజాం వారి ఆదేశం మేరకు బహిరంగ ప్రకటన యివ్వడం జరిగినది.

ఎ. సత్యన్నారాయణ
అడ్వకేట్,
సెల్ నెం. 9949176936,
రాజాం

బహిరంగ ప్రకటన
శ్రీ మహారాశ్రీ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, రాజాం, వారి కోర్టులో
CC.No. 321/2018

ఫిర్యాది – మల్లిక రామారావు
మరియు –
ముద్దాయి – టంకాల శ్రీరాం
టు,
టంకాల శ్రీరాం, తండ్రి రమణ, వ్యాపారం, మందరాడ గ్రామం, సంతకవిటి మండలం, సంతకవిటి P.S Limits, విజయనగరం జిల్లా.

పై నెంబరు CC.No. 321/2018లో శ్రీ కోర్టు వారు పై ముద్దాయి అయిన మీకు చాలా పర్యాయములు, కోర్టు సమన్లు పంపించిన మీరు తపాలాశాఖ వారిని మరియు పోలీసు వారికి దొరకకుండా ఉద్దేశ్యపూరకంగా తప్పించుకుంటూ యున్నారు. కావున శ్రీ కోర్టు వారు ఈ బహిరంగ ప్రకటన ద్వారా మీపై గల పై కేసు తే. 03.02.2025 దికి వాయిదావేయబడినదని ఈ బహిరంగ ప్రకటన మూలంగా మీకు తెలియజేయుచున్నాము. కావున **తే.03.02.2025 దిన** గానీ ముందుగా గానీ **ఉదయం 10.30 ని॥**లకు పైన పేర్కొన్న శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ వాదనను వినిపించవలసిందిగా కోరడమైనది. లేని యెడల మీపై పరోక్షంగా Civil & Criminal చర్యలు తీసుకొనబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

పై విషయము శ్రీ మహారాశ్రీ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, రాజాం వారి ఆదేశం మేరకు బహిరంగ ప్రకటన యివ్వడం జరిగినది.

ఎ. సత్యన్నారాయణ
అడ్వకేట్,
సెల్ నెం. 9949176936,
రాజాం